క్లుప్తంగా

ఆలయ కమిటీ ఎన్నిక



రాయపర్తి : మండలంలోని గన్నారంలో భక్తాంజనేయ ఆలయ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా డాక్టర్ జన్నపురెడ్డి శ్రీరాంరెడ్డి, అధ్యక్షులుగా అల్లాడి కరుణాకర్, మండల రాజు, ఉపాధ్యక్షులుగా జన్నపురెడ్డి వేమన్‌రెడ్డి, బొల్లు సోమిరెడ్డి, కోశాధికారిగా నందనబోయిన సాంబశివ, కార్యదర్శిగా కల్మికొండ బొంద్యాలు, సహాయ కార్యదర్శులుగా నందనబోయిన ప్రవీణ్, గూడెల్లి ప్రభాకర్, సలహాదార్లుగా నందనబోయిన ప్రభాకర్, కందకట్ల యాదగిరి, గంకిడి రాజురెడ్డి, మరిపట్ల నర్సయ్య, అబ్బరబోయిన మహేశ్, కుక్కల నాగయ్య తదితరులు ఎన్నికయ్యారు.

ఆటో బోల్తా పడి ఇద్దరికి గాయాలు

నర్సంపేట రూరల్ : ఆటో బోల్తా పడి ఇద్దరికి గాయాలైన ఘటన నర్సంపేట మండలంలోని రాజుపేట గ్రామ శివారులోని సత్యం ఫంక్షన్ హాల్ ఎదుట జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన ఆటో నలుగురు ప్రయాణికులతో నర్సంపేట వైపు వస్తుండగా రాజుపేట శివారులో ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడింది. గాయాల పాలైన ఇద్దరిని స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో..

ఖానాపురం : ఆటోను లారీ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలైన ఘటన మండల కేంద్ర శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట వైపు నుంచి మహబూబాబాద్ దిశగా వెళ్తున్న లారీ గూడురు వైపు నుంచి నర్సంపేటకు వస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

గృహిణి అదృశ్యం

గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన మేకల చిట్టి గత నెల 31న కనిపించడం లేదని ఆమె భర్త శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు. తాను తన మేనమామతో మాట్లాడిన విషయం నచ్చకపోవడంతో ఇంటి నుంచి వెళ్లిపోతున్నానంటూ చిట్టి తనకు వాట్సప్ మెసేజ్ పెట్టి వెళ్లిపోయినట్లు శ్రీకాంత్ ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై చెప్పారు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లికి చెందిన వశపాక కట్టయ్య శనివారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఇల్లంద మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముద్రబోయిన వెంకన్న, బీసీ సెల్ మండల అధ్యక్షుడు మచ్చ కుమారస్వామి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాశం నరోత్తంరెడ్డి, నాయకులు బొమ్మెర శంకరయ్య, వశపాక ఎల్లయ్య, వశపాక రాజు, శీల ఎల్లారెడ్డి, వశపాక భిక్షపతి, మెరుగు రంజిత్, గజవెల్లి సత్తులు, యాకయ్య, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం సాయం

కిట్టయ్య కుటుంబానికి వివేకానంద ట్రస్ట్ సభ్యులు బియ్యం సాయం చేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మడిపెద్ది నాగార్జున్, సభ్యులు బండి రాజు, రఘు, గజవెల్లి నాగరాజు, మడిపెద్ది నరేశ్, మేరుగు గణేశ్, ప్రశాంత్, బక్క ఆనంద్ పాల్గొన్నారు.

తునికి చెట్ల నరికివేతపై జరిమానా

గూడూరు: మండలంలోని పారెస్టు రేంజ్ పరిధిలో చిన్నఎల్లాపురం అటవీ ప్రాంతంలో కొంతమంది తునికాకు కూలీలు అక్రమంగా పెద్ద పెద్ద తునికి చెట్లను నరికి ట్రాక్టర్లలో తరలించే ప్రయత్నం చేస్తున్నారని డీఆర్‌ఓ శ్రీనివాస్ రెడ్డికి విశ్వసనీయ సమాచారం అందడంతో పారెస్టు సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిశీలించాడు. బాధ్యులను గూడూరు పారెస్టు రేంజ్ కార్యాలయానికి తరలించి జరిమానా విధించినట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

తొర్రూరు : తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన సంఘటన శనివారం డివిజన్ కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నితిన్ ఫౌండేషన్ భవన్ సమీపంలో నివాసం ఉండే అట్లూరి సోమేశ్వర్ కుటుంబ వ్యక్తిగత పని నిమిత్తం మండలంలోని అమ్మాపురం గ్రామానికి వెళ్లారు. పని ముగించుకొని తిరిగి ఒంటికి రాగా తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. దీంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. మూడు తులాల బంగారం, రూ.30వేలు అపహరణకు గురైనట్లు బాధితుడు తెలిపాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా హనుమాన్ జయంతి



గీసుకొండ : ఆలయంలో పూజ చేస్తున్న భక్తులు



రాయపర్తి : జగన్నాథపల్లిలో..



చెన్నారావుపేట : ఇరుముడితో వెళ్తున్న భక్తులు



ఖానాపురం : అన్నదానం చేస్తున్న బాధ్యులు

గీసుకొండ : మండలంలోని కోనాయమాకుల సమీపంలోని సుప్రసిద్ధ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ మాలధారులు, భక్తులు 'జై హనుమాన్.. జై శ్రీరాం' నినాదాలతో హోరెత్తించారు. పలువురు మాల విరమణ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు సీతా ఆనంద్ సా, కుమార్ సా సోదరులతోపాటు ప్రధాన అర్చకుడు జాగర్లపూడి అయ్యప్ప శర్మ పాల్గొన్నారు.

చెన్నారావుపేట : హనుమాన్ మాలధారులు మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇరుముడితో మాల విరమణ కోసం కొండగట్టు, భద్రాచలం, తదితర పుణ్యక్షేత్రాలకు వెళ్లారు. తొలుత హనుమాన్ శోభాయాత్ర నిర్వహించి భజన చేశారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

మండల కేంద్రానికి చెందిన మీ సేవ కేంద్రం నిర్వాహకులు ములుక కళావతి, ఐలయ్య, రేవంత్ ప్రజలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీ సేవ కేంద్రం బాధ్యుడు, ప్రముఖ యోగా గురువు ములుక ఐలయ్య మాట్లాడారు. ఎండాకాలం నేపథ్యంలో బాటసారులకు, హనుమాన్ స్వాములకు మజ్జిగ ప్యాకెట్లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జున్నూతుల రాంరెడ్డి, నాయకులు వెంగళ రవీందర్, ఈగ సత్యనారాయణ, పోలెపల్లి భిక్షపతి, నాంపెల్లి చంద్రయ్య, కల్వచర్ల సదానందం, మంకు ప్రదీప్‌రెడ్డి, రాజేష్, మల్లయ్య, మంజుల, రామక్క, కవిత, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని హనుమన్ విగ్రహం వద్ద హనుమన్ కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి అన్నదానం చేశారు.

రాయపర్తి : మండలంలోని జగన్నాధపలిలో నంగునూరి సోమయ్య కుమారులు సంపత్‌కుమార్, మోహన్, అశోక్‌కుమార్ దంపతులు హనుమాన్ జన్మోత్సవ వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి, కేశవాపురం, ముద్దునూరు, మల్లంపల్లి, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో హనుమత్ జయంతి వేడుకలు నిర్వహించారు. హనుమాన్ విగ్రహాలకు చందనం వేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎదుగురి రమేశ్‌మూర్తి, నాగేందర్‌స్వామి, సాగర్‌చార్యులు, గాదెపాక రాములు తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండలంలోని పలు ఆలయాల్లో ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు. వడలను మాలలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



ఖానాపురం : స్వాధీనం చేసుకున్న సామగ్రితో అధికారులు

● భారీగా బెల్లం, పటిక, మద్యం స్వాధీనం

ఖానాపురం : మండలంలోని నాజీతండ, బోటిమీది తండాల్లోని గుడుంబా స్థావరాలపై స్థానిక పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది శనివారం దాడులు చేశారు. సుమారు 2 వేల లీటర్ల బెల్లం, చక్కెర పానకాన్ని ధ్వంసం చేసి 100 కేజీల బెల్లం, 5 కిలోల పటిక, 35 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని 9 మందిపై కేసులు నమోదు చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు మాట్లాడారు. గుడుంబా తయారీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బెల్లం అక్రమ రవాణాకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్‌లు మురళీధర్, శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్ ఎస్సైలు రాజన్న, శిరీష, పోలీసు శాఖ సీఐలు రమేశ్‌చందర్, నరేశ్‌రెడ్డి, ఎస్సై రఘుపతి, సిబ్బంది సుమన్, మహేందర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ఖానాపురం : నర్సంపేట పట్టణ పరిధిలోని ద్వారకపేట నుంచి ఆయకట్టు పొలాలకు వెళ్లే రోడ్డు నిర్మించాలని కోరుతూ ఎమ్మెల్యే మాధవరెడ్డికి రైతులు కాలె కుమారస్వామి, బ్రహ్మచారి, జాటోతు రవీందర్ శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. మాటువీరారం కట్టు కాల్వ మోరీ, వాగుపై వంతెన, వాగు నుంచి కొత్తూరు వరకున్న రోడ్డు నిర్మించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో రైతులు భద్రు, యాకూబ్, ఎల్లయ్య, శ్రీనివాస్, ఈర్య, గోవిందు, బాలు, చంద్రయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

పర్వతగిరి : ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పాక శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఫెడరేషన్ మండల అధ్యక్షుడు వరంగంటి సంపత్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల కమిటీ సమావేశానికి శ్రీనివాస్ అతిథిగా హాజరై మాట్లాడారు. 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే పాఠ్యపుస్తకాలు, అభ్యాస పుస్తకాలు, యూనిఫాం పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. బడిబాటను అధికారులు, గ్రామస్తుల సహకారంతో నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎఫ్, సరెండర్ తదితర సప్లమెంటరీ బిల్లులతోపాటు నాలుగు విడతల డీఏ బకాయిలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు మేకిరి దామోదర్ మాట్లాడుతూ బదిలీ అయి రిలీవ్ కాని ఉపాధ్యాయులను పాఠశాలల ప్రారంభం నాటికే నూతన పాఠశాలల్లో జాయిన్ అయ్యేలా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల మేరకు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పీఆర్సీ చర్చలు పూర్తయిన నేపథ్యంలో వెంటనే వేతన సవరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి గుండు కరుణాకర్, ఉపాధ్యక్షుడు పరిమళ శివప్రసాద్, కోశాధికారి రమావత్ శ్రీనివాస్, కార్యదర్శి పాడిచెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఐ రజాక్

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండల సర్వసభ్య సమావేశం శనివారం సాదాసీదాగా జరిగింది. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సి ఉండగా కోరం లేకపోవడంతో 12 గంటలకు ఎంపీపీ మోతె కళావతి అధ్యక్షతన ప్రారంభించారు. ఆయా శాఖల అధికారులు నివేదికలు సమర్పించగా ఎంపీపీ సమీక్షించారు. మండల సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఆకాంక్షించారు. పదవీ కాలం ముగిసిన క్రమంలో సర్పంచ్‌లు లేకపోవడంతో సర్వసభ్య సమావేశం నామమాత్రంగా ముగిసింది. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ మౌనిక, ఎంపీటీసీలు వీరన్న, విజయ, ఎంపీఓ సునీల్‌కుమార్, ఆర్‌ఐ రజాక్, పంచాయతీ రాజ్ శాఖ ఏఈ శ్రీనివాస్, పశు వైద్యురాలు విద్య, ఐకేపీ ఏపీఎం మహేందర్, ఏపీఓ ఫాతిమా మేరీ, ఆర్‌ఐ రజాక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ర్యూనీస్, తదితరులు పాల్గొన్నారు.

పాకాల దారిలో భారీ గుంత

● పర్యాటకులకు పొంచి ఉన్న ప్రమాదం



అశోక్‌నగర్ శివారులో రోడ్డు పక్కనున్న గుంత

ఖానాపురం : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పాకాల ఒకటి అన్నది జగమెరిగిన సత్యం. పాకాలకు ఉమ్మడి వరంగల్ నుంచే కాకుండా తెలంగాణ, ఏపీలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి సైతం పర్యాటకులు రావడం పరిపాటి. కాగా పర్యాటకానికి వెళ్లే దారిలో అశోక్‌నగర్ శివారులో రోడ్డు పక్కన భారీ గుంత పడడంతో ప్రమాదం పొంచి ఉంది. అయినా ఆర్ అండ్ బీ, సంబంధిత ఇతర శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు. అశోక్‌నగర్ శివారులో గతేడాది అకాల వర్షాలకు రోడ్డు వెంట మట్టి కొట్టుకుపోయి భారీ గుంత ఏర్పడిన విషయం తెలిసిందే. సంవత్సరం గడచినా అధికారులు సదరు గుంతను పూడ్చడానికి చర్యలు చేపట్టకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు స్పందించి గుంతను పూడ్చి ప్రమాదాలు జరగకుండా చూడాలని మండల ప్రజలు, పర్యాటకులు కోరుతున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



నర్సంపేట రూరల్ : తనిఖీ చేస్తున్న సీఐ రమణ



నల్లబెల్లి : తనిఖీ చేస్తున్న సీఐ రాజగోపాల్



ఖానాపురం : తనిఖీ చేస్తున్న అధికారులు



రాయపర్తి: మాట్లాడుతున్న ఎస్సై సందీప్‌కుమార్



నెక్కొండ : తనిఖీ చేస్తున్న ఎస్సై మహేందర్

నర్సంపేట రూరల్ : నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి, మండల వ్యవసాయ అధికారి కృష్ణకుమార్ స్పష్టం చేశారు. నర్సంపేటలోని పలు విత్తన, ఎరువుల షాపులను శనివారం వారు తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సీఐ రమణమూర్తి, ఏఓ కృష్ణకుమార్ మాట్లాడారు. డీలర్లు ప్రభుత్వ అనుమతి ఉన్న ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు మాత్రమే విక్రయించాలని చెప్పారు. ప్రభుత్వ నిషేధిత విత్తనాలు విక్రయించొద్దని తెలిపారు. విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు కొనుగోలు చేసే సందర్భంలో రైతులకు పూర్తి వివరాలతో రసీదు ఇవ్వాలని స్పష్టం చేశారు. సీజన్ ప్రారంభం కానున్న క్రమంలో విత్తనాల కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

నిబంధనలు కచ్చితంగా పాటించాలి

నల్లబెల్లి : ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్లు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని నర్సంపేట రూరల్ సీఐ రాజగోపాల్ చెప్పారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్స్, సీడ్స్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బిల్ బుక్స్, స్టాక్ రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ మాట్లాడారు. ప్రభుత్వం బీటీ–3 పత్తి విత్తనాలను నిషేధించిందని గుర్తు చేశారు. ఎమ్మార్పీకే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు విక్రయించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ పరమేశ్వర్, ఆర్‌ఐ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రైతులు బిల్లులు భద్రపర్చుకోవాలి

నెక్కొండ : విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన క్రమంలో రైతులు బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని ఎస్సై మహేందర్, ఏఓ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ రవి సూచించారు. మండల కేంద్రంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మహేందర్, ఏఓ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ రవి మాట్లాడారు. నకిలీ విత్తనాల సరఫరా, క్రయ విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచామని చెప్పారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు విక్రయించనున్న విత్తన నిల్వలు, వాటికి సంబంధించిన ధృవ పత్రాలను, విత్తన ధరలను పరిశీలించామని తెలిపారు. రైతులు బ్రాండెడ్ కంపెనీల విత్తనాలే కాకుండా, మార్కెట్‌లో అందుబాటులో ఉన్న అన్ని రకాల పత్తి విత్తనాలను కొనుగోలు చేయవచ్చని వివరించారు. అన్ని రకాల పత్తి విత్తనాల దాదాపు సమాన దిగుబడులు ఇస్తాయన్నారు.

ఎమ్మార్పీకే విత్తనాలు విక్రయించాలి

ఖానాపురం : డీలర్లు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు ఎమ్మార్పీకే విక్రయించాలని ఎస్సై రఘుపతి, ఏఓ బోగ శ్రీనివాస్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని పలు విత్తన దుకాణాల్లో వారు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం ఎస్సై, ఏఓ మాట్లాడారు. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ అనుమతులు ఉన్న విత్తనాలనే విక్రయించాలని తెలిపారు. విత్తనాలపై సందేహాలుంటే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ సారయ్య, ఐలేశ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

రాయపర్తి : వానాకాలం మొదలవుతున్న తరుణంలో రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వడ్డె సందీప్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే డీలర్లపై కేసులు నమోదు చేయడంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులకు అన్ని రకాల విత్తనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. డీలర్లు లైసెన్స్ కలిగి ఉండాలని, గడువు ముగిసిన విత్తనాలు విక్రయించొద్దని, తదితర సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్సై సదానందం, ఏఓ గుమ్మడి వీరభద్రం పాల్గొన్నారు.

తెలంగాణ అమరుల ఆశయాలు కొనసాగిస్తాం



దుగ్గొండి : తెలంగాణ అమరవీరుల ఆశయాలు కొనసాగిస్తామని జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నం మొగిలి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని అమరవీరుల స్తూపానికి శనివారం వారు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. అమరుల కుటుంబాలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు శంకేషి కమలాకర్, మేర్గు రాంబాబు, బొమ్మగాని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



డీఏఓకు వినతిపత్రం ఇస్తున్న సూరి, నాయకులు

నర్సంపేట : వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత రైతు సంఘం (ఏఐకేఎస్) ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయ డీఏఓ శ్రీనివాసరావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రాష్ట్ర నాయకుడు చిర్ర సూరి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2024లోనే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించి రైతులను మోసం చేసిందన్నారు. గత ప్రభుత్వాలు సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందించగా బీజేపీ రద్దు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు లింగన్న, డివిజన్ నాయకుడు కుస్మ మల్లేషం, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అడ్డూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

'బుర్రా వెంకటేశంపై ఆరోపణలు తగదు'

నర్సంపేట : తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం గౌడ్‌పై యూ ట్యూబ్ ఛానల్ రిపోర్టర్ శివారెడ్డి ఆరోపణలు చేయడం తగదని గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ గౌడ్ అన్నారు. పట్టణంలోని సర్వాపురం గౌడ సంఘం భవనం ఆవరణలో శనివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సమగ్ర శిక్షణ పథకం కింద రూ.2400 కోట్లు మంజూరు చేయక ముందే ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం గౌడ్ రూ.150 కోట్లు స్వాహా చేశాడని శివారెడ్డి ఆరోపించడం దుర్మార్గమని మండిపడ్డారు. శివారెడ్డి ఆరోపణలు ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మోకుదెబ్బ రాష్ట్ర నాయకులు గంప రాజేశ్వర్, మద్దెల సాంబయ్య, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాంపల్లి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు గండి గిరి, చెన్నారావుపేట కన్వీనర్ గౌడిశాల మల్లయ్య, ఖానాపురం మండల అధ్యక్షుడు మేరుగు గంగాధర్, నాయకులు సట్ల సురేశ్, గుర్రం కృష్ణమూర్తి, సట్ల సంతోశ్, దొమ్మటి శ్రీనివాస్, బూర్గు కట్టయ్య, మచ్చిక శివకుమార్, జలగం నర్సయ్య, తాళ్లపెల్లి కుమార్, మండ రాకేశ్, అనంతుల స్వామి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నియామకాలపై విచారణ చేపట్టాలి



నర్సంపేట రూరల్ : నర్సంపేట మెడికల్ కళాశాలలో చేపట్టిన అక్రమ నియామకాలపై విచారణ చేయాలని ఏబీఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎంఎస్ఎఫ్ నాయకులు బొట్ల నరేశ్, అల్వాల నరేశ్, సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సదరు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నర్సంపేట మెడికల్ కళాశాల ఎదుట శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కళాశాలలో 12 పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇవ్వగా ప్రిన్సిపాల్ కిషన్ అక్రమంగా 32 పోస్టులు భర్తీ చేశారని తెలిపారు. ఎలాంటి నోటిఫికేషన్, ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా 20 పోస్టుల నియామకాన్ని అక్రమంగా చేపట్టిన ప్రిన్సిపాల్‌తోపాటు బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, సదరు పోస్టులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, భూషణ్, పటేల్ తదితరులు పాల్గొన్నారు.